నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
1
మెదక్
బుధవారం | 25 డిసెంబర్ 2024 | www.navatelangana.com

ఆర్టీసీ బస్టాండ్ పనులు పరిశీలించిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ బస్టాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న బస్ స్టాండ్ పునరాభివృద్ధి మరమత్తులు పనులు ఎక్కడి వరకు వచ్చాయని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. పనుల ఆలస్యంపై అధికారులతో అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్ స్టాండ్‌లో బ్యూటిఫికేషన్ లోపలికి, బయటకు వచ్చే మార్గాల అభివృద్ధి, బస్ స్టేషన్ బయట కాంప్లెక్స్‌లకు రంగుల పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బస్‌స్టాండ్ ఆవరణలో రోడ్డు డివైడింగ్‌లో షాపులు కోల్పోతున్న వారికి నష్టం జరగకుండా చూస్తామన్నారు. డిసెంబర్ 31 లోపు బస్ స్టాండ్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి , సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, కౌన్సిలర్లు చిత్తరి పద్మ రవీందర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరిశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట



జిల్లా ప్రజలకు, క్రైస్తవలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమా భావాన్ని, సేవాతత్పరతను , క్షమా గుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. పర్వదినం క్రిస్టియన్ సోదరుల అందరికి శుభం చేకూరాలని అ ఏసు ప్రభును ప్రార్థించారు. కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుక జరుపుకోవాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికి లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.


జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం అంతకపేట శివారులో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను ఎస్జిఎఫ్ మండల ఇన్చార్జ్ జంగపల్లి వెంకట నరసయ్య ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎస్సై విజయ్ భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. సైక్లింగ్‌లో విద్యార్థులు మండల స్థాయిలో కాకుండా దేశ స్థాయిలో కూడా మంచి గుర్తింపు సాధించాలని కోరారు. అనంతరం గెలుపొందిన వారికి జంగపెల్లి మల్లయ్య స్మారకార్థం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సుజాత, ఫిజికల్ డైరెక్టర్ కాటం శ్రీనివాస్, సైక్లింగ్ కోచ్ సంజీవ్, తెలంగాణ పిఆర్టియు డిస్ట్రిక్ట్ అసోసియేట్ ప్రెసిడెంట్ యామ రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాంద్రాల దాము, హుస్నాబాద్ యూత్ అధ్యక్షులు పోచవేణి శ్రీశైలం పాల్గొన్నారు.


సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులకు టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌లు మాట్లాడుతూ విద్యారంగంలో క్రియాశీలకపాత్ర పోషిస్తున్న కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల, ట్రైబల్ వెల్ఫేర్ సిఆర్టిల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, ఉపాధ్యక్షులు అజీజ్, ప్రభాకర్, కార్యదర్శి శ్రీనివాస్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, ఎస్ .ఎస్. ఏ. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్,కృష్ణవేణి,పద్మస్వప్నతదితరులు పాల్గొన్నారు

భూమి పోతుందనే భయంతో మృతి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చుంచు ఎల్లవ్వ (65) అనే వృద్ధురాలు భూమి పోతుందనే భయంతో గుండెపోటుకు గురైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం చౌటపల్లి గ్రామ శివారులోని 312 సర్వే నెంబర్‌లో తమ భూమి ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రభుత్వం తీసుకుంటుందని, గత కొద్ది రోజులుగా ఇదే విషయాన్ని పలువురికి చెప్పుకుంటూ బాధపడుతున్నట్లు తెలుస్తోంది. చివరికి బాధ తట్టుకోలేక మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందిందని అన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు..



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామంలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో సిస్టర్ శాలిని అధ్వర్యంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రోషాలి హాజరై బోధన సిబ్బంది, విద్యార్థులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకారణగా నిలిచాయి.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రకియ



నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాల నమోదు ప్రక్రియ అధికార యంత్రాంగం ముమ్మరంగా చేపడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలను ఇందిరమ్మ యాప్ ద్వార నమోదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల వివరాల నమోదు పారదర్శకంగా చేపడుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి తెలిపారు.

చీరకు నిప్పంటుకొని మహిళ మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి

గ్యాస్ స్టవ్ మంటకు చీర అంటుకొని చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధి హస్తాల్పూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి హస్తాల్ పూర్ గ్రామానికి చెందిన మామిండ్ల బుచ్చమ్మ (55) గత గురువారం రాత్రి చలికి తట్టుకోలేక గ్యాస్ స్టవ్‌ను వెలిగించి కాచుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా చీర కొంగుకు నిప్పంటుకుంది. వెంటనే కేకలు వేస్తూ బయటకు పరిగెడుతున్న క్రమంలో పాక్షికంగా కాలిపోయి ఉండడం గమనించిన ఇరుగుపొరుగు వాళ్ళు మంటలు చల్లార్పి హైదరాబాదులోని సుచిత్ర రష్ హాస్పిటల్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం చనిపోవడం జరిగింది. ఆమె మృతికి ఎవరు కారణం కాదని గ్యాస్‌స్టవ్ ద్వారా అకస్మాత్తుగా మంటలు అంటుకొని మృతి చెందిందని మృతురాలి మరిది స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

కల్పగూర్‌లో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి కలపగూరు గ్రామంలో జరిగే క్రిస్మస్‌కు కేకు పంపిణి చేశారు సంగారెడ్డి మాజీ ఎంపిపి లావణ్య దుర్గేష్ తనయుడు సాయి ఆధ్వర్యంలో కేకులు పంపించారు. సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు.ఎం. శ్రీనివాస్ రావు, బి దేవదాస్, యూత్ అధ్యక్షులు ఎన్. ప్రవీణ్, టి. నవీన్ యూత్ సభ్యులు, సంఘస్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించిన వెంకటస్వామి గౌడ్



నవతెలంగాణ-మిరుదొడ్డి

మేడ్చల్ మల్కాజ్ గిరి గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డిని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ హైదరాబాదులో శాలువాతో సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుతుబ్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా తనతో పాటు పనిచేసి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందుకు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పాతూరి శ్రీనివాస గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్తే వెంకటేశం, రాజిరెడ్డి, పరశురాములు గౌడ్ పాల్గొన్నారు.

హామీలు..అభివృద్ధి







- ఏడుపాయల... అసౌకర్యాల ఆలయం
- జాడలేని టూరిజం సర్క్యూట్
- నిజాం షుగర్ ప్యాక్టరీపై కమిటీతో సరి
- అతీగతిలేని బైపాస్,రింగ్ రోడ్డు...ట్రాఫిక్ తిప్పలు
- రామాయంపేట రెవెన్యూ డివిజన్ హామీకే పరిమితం
- ఏడుపాయల, మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు
- తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి మెదక్‌లో అధికారిక పర్యటన
- వరాలు కురిపిస్తారని ప్రజల ఆశ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ జిల్లానే కాదు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో పాలకుల దోబూచిలాట కనిపిస్తుంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొన్ని హామీలు అమలు కాని మాట నిజం. అలాగే ఏడాది ఈ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంలో జాప్యం చేస్తుంది. ఏటొచ్చి ప్రజలే సఫరవుతున్నారు. "హామీలు బోలెడు... అభివృద్ధి మూరెడు" అన్న చందంగా మెదక్ పరిస్థితి ఉంది. ఏడుపాయల వన దేవతను సందర్శించేందుకు తొలిసారి ముఖ్యమంత్రి వస్తుండడంతో దేవాలయ అభివృద్ధికి ఎన్నో వరాలిస్తారనే ఆశతో ప్రజలున్నారు. అసౌకర్యాల ఆలయంగా ఉన్న ఏడుపాయలలో భక్తులుండేందుకు వసతిలేదు. పారిశుద్ధ్యం పట్టదు. అలాగే టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామన్న హామీ జాడలేదు. నిత్యం రద్దీగా ఉండే మెదక్ పట్టణానికి బైపాస్, రింగ్ రోడ్డులేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేయాలని కోరుతున్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్, ఉపాధి కోసం పరిశ్రమలు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల వంటివి సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేయాలని కోరుతున్నారు. 100 ఏళ్ల మెదక్ చర్చి అభివృద్ధికి, ఏడుపాయల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

టూరిజం సర్క్యూట్...?

మెతుకు సీమ మెదక్ అంటేనే ఏడుపాయల వన దేవత గుర్తుకొస్తది. ఏటా సాగే జన జాతరకు లక్షలాది భక్తులొస్తారు. పేరు ప్రఖ్యాతలకు తగినంతగా అభివృద్ధి కాలేదన్నది నిజం. ముఖ్యంగా జాతర వేలే కాదు ఇతర రోజుల్లోనూ భక్తులుండేందుకు వసతిలేదు. కొద్దిపాటి వసతి గృహాలున్నా అవి సామాన్య భక్తులకు అందవు. భక్తులుండేందుకు అవసరమైన వసతి, మరుగుదొడ్లు, మంచినీటి వ్యవస్థ, రోడ్లు విస్తరణ, చలువ పందిళ్ల లేకపోవడం వెలితిగానే ఉంది. మరో పక్క వందేళ్ల చరిత్ర కల్గిన మెదక్ చర్చి, మెదక్ ఖిల్లా, కొల్చారం జైన మందిరం, పోచారం అభయారణ్యం, ఏడుపాయల దేవాలయం వంటి ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి వదిలేసింది. ఈ ప్రభుత్వమైనా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

రింగ్‌రోడ్డు, బైపాస్ ఎప్పుడు..?

మెదక్ పట్టణంలో 70 వేల జనాభా దాటింది. పట్టణంలోని రోడ్లన్నీ ఇరుకుగా ఉన్నాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క సిద్ది పేట-సంగారెడ్డి ప్రధాన రహదారి, హైదరాబాద్-ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్ ఎన్‌హెచ్ 765(డి) రోడ్డు మెదక్ పట్టణం నుంచే ఉన్నాయి. దీంతో స్థానిక వాహనాలే కాకుండా వేల సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు తిరగడం వల్ల పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులేర్పడుతున్నాయి. మెదక్ చుట్టు రింగ్ రోడ్డు, బైపాస్ అవసరమని చెప్పారు. అదిగో ఇదిగో చూడు నిధులంటూ చెప్పడం తప్ప ఏ ప్రభుత్వం చేయట్లేదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

నిజాం షుగర్‌కు పునర్జీవం వచ్చేనా

మెతుకు సీమ మెదక్ చెరకు పంటకు ప్రసిద్దిగాంచింది. అప్పట్లోనే స్థానిక రైతుల అవసరాల కోసం మెదక్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ నెలకొల్పారు. అయితే అది మధ్యలో నష్టాల పేరిట మూసేసిన పరిస్థితి ఉంది. రైతులు సైతం చెరకు పంటకు ప్రత్యామ్నాయం వరి, ఇతర పంటలేయడం పెరిగింది. గత ప్రభుత్వం నిజాం షుగర్‌ను పట్టించుకోలేదు. కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి వస్తే నిజాం షుగర్ ప్యాక్టరీకి పునర్జీవం పోస్తామని హామీ ఇచ్చి అధ్యయనం కోసం కమిటీ వేశారు. ప్యాక్టరీకి పూర్వ వైభవం వస్తుందా రాదా అనేది అస్పష్టతరాలేదు. దీంతో రైతులు చెరుకు పంట సాగు వైపు మళ్లలేకపోతున్నారు.

రామాయంపేట డివిజన్ ఎప్పుడో..?

గత ప్రభుత్వంలోనే రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రజలు పోరాడారు. దీంతో మాజీ సీఎం కేసీఆర్ ఎన్నిక వేళ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించారు. అప్పుడు జరిగిన పోరాటానికి మద్దతు పలికిన ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సైతం హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎందుకు ఆ ప్రస్తావన చేయట్లేదని రామాయంపేట ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు స్థాపిచాలని కోరుతున్నారు.

100 ఏళ్ల చర్చి అభివృద్ధికి నిధులు

100 చరిత్ర కల్గిన మెదక్ చర్చిని మరింత అభివృద్ధి చేయాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. 25 డిసెంబర్ 2024తో వందేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.29 కోట్లా 18 లక్షలా 50 వేల నిధుల్ని మంజూరు చేశారు. పనులకు సంబంధించి సీఎం బుధవారం శంఖుస్థాపన చేయనున్నారు. అదే విధంగా ఏడుపాయలకు ముఖ్యమంత్రిగా హోదాలో ఎవరూ రాలేదు. రేవంత్‌రెడ్డి తొలిసారి రాబోతున్నారు. ఏడుపాయల అభివృద్ధి కోసం కూడా ప్రత్యేకంగా నిధుల్ని కేటాయించారు. అట్టి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కొంటూరు చెరువు, కొంటూరు గ్రామంలో గల జామ మసీద్, ఏడుపాయల దేవాలయం, పోచారం అభయారణ్యం అభివృద్ధికి సంబంధించి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఇలా

సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం 10.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని ఘనపూర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్ వద్ద దిగుతారు. 11.05 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఏడుపాయల చేరుకుని వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలం వేసిన తర్వాత ప్రత్యేక పూజలు చేస్తారు. 12 గంటలకు మెదక్ చర్చి ప్రాంగణానికి చేరుకుంటారు. రూ.29.18 కోట్లతో చేపట్టనున్న వివిధ పనులకు శిలాఫలం వేస్తారు. 100 ఏళ్ల వేడుకల్లో పాల్గొని క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలుపుతారు. 12.25 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 1 గంటకు కౌడిపల్లి మండలంలోని తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రం చేరుకుంటారు. నేచురల్ ఆర్గానిక్ వ్యవసాయ పద్దతులను పరిశీలిస్తారు. బ్రిప్ హల్ట్ తర్వాత 3 గంటలకు హైదరాబాద్ బయలుదేరుతారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటించనున్నందున భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయబాస్కర్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పర్యవేక్షించారు. రోడ్డు మార్గంలో ప్రయాణించనున్నందున మెదక్ చర్చి, ఏడుపాయల వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఘన్‌పూర్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సీఎం పర్యటనకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు కట్టారు.

గంగకత్వ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

మండలంలోని చెరువులన్నీ నింపాలి

ఇంటింటికీ సీపీఐ(ఎం) కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు

మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

నవతెలంగాణ-సదాశివపేట



గంగ కత్వ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండలం లోని చందాపూర్ గ్రామంలో ఇంటింటికీ సీపీఐ(ఎం) విరాళాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. మండలంలోని చెరువులన్నీ నింపే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. మండలంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నా యని వాటి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. జనవరి 25 నుండి 28 వరకు జరిగే రాష్ట్ర మహాసభల కోసం మెగా ఇంటింటా విరాళాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. మహాసభల ప్రచారంలో ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు. మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారన్నారు. పార్టీ మహాసభల్లో పెద్ద ఎత్తున పాల్గొన డంతోపాటు.. విరివిగా విరాళాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ప్రవీణ్, నాయకులు రమేష్ గౌడ్,మల్లేష్ శ్రీనివాస్, పాండురంగం వరప్రసాద్ రమేష్ సిరాజ్ మల్లేశం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి పర్యటనకు భారీ పోలీస్ బందోబస్తు



నవతెలంగాణ- కౌడిపల్లి

మండలం తునికిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి పర్యటనకు 500 మంది పోలీసు బందోబస్తు ఉంటుందని విశ్వసనీయ సమాచారం. బుధవారం జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ, సిరిసిల్ల ఎస్పీ, అఖిల్ మహాజన్, డీఎస్పీలు ఆరుగురు, సిఐలు 20 మంది, ఎస్సైలు 50, ఇయర్ నిర్మల్ సిరిసిల్ల చెందిన 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హెలిపాడ్ స్థలాన్ని ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ మహేందర్ పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపరాష్ట్రపతి ఆర్గానిక్ వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారని, ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతులతో నేరుగా మాట్లాడతరని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో , అదనపు కలెక్టర్ నగేష్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవి, ప్రతాప్ రెడ్డి, కిరణ్, తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, ఎక్సైజ్ పద్మ, ఆర్డీవో మైపాల్, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్, స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి, అదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-శివ్వంపేట

తన అన్నతో కలిసి తిరుగుతున్నావని తమ్ముళ్లు వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సాయిలు తెలిపారు. కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన గొల్ల వెంకటేష్ వెంట తిరుగుతున్నాడని మనసులో పెట్టుకొని వెంకటేష్ తమ్ముళ్లు గొల్ల నవీన్, గొల్ల యాదగిరిలు చాకలి శ్రీనివాస్‌ను బూతు మాటలు తిడుతూ, కట్టెలతో దాడి చేశారని బాధితుని భార్య భాగ్యలక్ష్మీ పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సాయిలు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు

- రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ
- న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి





నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సమగగ్ర శిక్ష ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట్ జిల్లా అధ్యక్షులు దేవా రాజ్ మాట్లాడుతూ. శ్రమ దోపిడికి గురవుతున్న వారికి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు జారీ చేయాలని, అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు జాలిగామ బాలకిషన్ ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్ నాయక్, కోశాధికారి కరుణాకర్.రాష్ట్ర కార్యదర్శి ఎం సురేందర్ .వెంకట్ రెడ్డి. మహేష్ రాజేష్. వరలక్ష్మి సావిత్రి, కృష్ణవేణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే రూ.750 కోట్ల నిధులు

- ముఖ్యమంత్రి హెూదాలో ఏడుపాయలకు రావడం ఇదే తొలిసారి
- గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజక వర్గాన్నికి తీరని అన్యాయం
- మొసలి కన్నీరు కార్చి నియోజక వర్గ ప్రజలను మోసం చేసింది బిఆర్ఎస్ పార్టీయే
- మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్



నవతెలంగాణ-పాపన్నపేట

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే మెదక్ నియోజకవర్గానికి రూ. 750 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ మంగళవారం పేర్కొన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారి మెదక్ నియోజక వర్గంలోని ఏడుపాయల దుర్గమ్మ దేవాలయాన్ని దర్శించుకోవడం చరిత్రలో మొదటిసారని ఆయన గుర్తుచేశారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నియోజక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. అంతే కాకుండా మెదక్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నియోజక వర్గ ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని ఆయన విమర్శించారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో మొసలికన్నీరు కార్చి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆయన గుర్తుచేశారు.

పాపన్నపేట మండలానికి రూ. 35 కోట్లు మంజూరు

మెదక్ నియోజకవర్గంలోని పాపన్నపేట మండలానికి డివైడర్‌లు బటర్‌ఫ్లై లైట్స్‌తో పాటు ఏడుపాయల్లో రూప్ ఏర్పాటుకు ప్రభుత్వం ఈ నెల 24వ తేదిన విడుదల చేసిన జీ.ఓ. నెం. 810 ద్వారా రూ.35 కోట్లను పంచాయితీ రాజ్ శాఖకు నిధులు విడుదలయ్యాయని నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు.



రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు కుకునూరుపల్లి విద్యార్థులు

నవతెలంగాణ-కొండపాక



సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ టేబుల్ టెన్నిస్ అండర్ 19 జూనియర్ బాలుర విభాగంలో కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన గౌతమ్ కుమార్ 9వ తరగతి బంగారు పతకం జిషాన్ అలీ 8వ తరగతి వెండి పతకం అలాగే బాలికల విభాగంలో భానుప్రియ వెండి పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే హర్షిత్, వర్షిత ఎనిమిదో తరగతి క్యాంస పథకం సాధించారు. మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య వ్యాయామ ఉపాధ్యాయుడు క్యాతం రాజ్ కుమార్ తెలిపారు. రూరల్ టు గ్లోబల్ అనే నినాదంతో నిర్వహించిన సీఎం కప్ టేబుల్ టెన్నిస్ పోటీలలో జెడ్ పి హెచ్ ఎస్ కుకునూరుపల్లి విద్యార్థులు గౌతమ్ కుమార్ జిశాన్ అలీ భానుప్రియ రాష్ట్రస్థాయికి ఎంపికై ఈ నెల 27వ తేదీ నుంచి హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఆడనున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కొండపాక



కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిప్పారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8,430/- లు, 06 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారంతో సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, కుకునూరు పల్లి పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫామ్ హౌస్‌లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు

వివాహ విందు వేడుకలో డీసీసీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-మనూర్

మండలంలోని తిమ్మాపూర్‌తాండాకు చెందిన మాజీ సర్పంచ్ వెంకట్ నాయక్ సోదరుడి కుమారుని వివాహ విందు వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. ఆ వేడుకలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకాష్ రావు, వెంకట్ నాయక్ తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ

సంగారెడ్డి

బుధవారం | 25 డిసెంబర్ 2024 | www.navatelangana.com

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, ఆధ్యాత్మికతకు నిలయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం పోచారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహెూత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగన్, పీఏసీఎస్ చైర్మెన్ బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, నాయకుడు దశరథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు..

నవతెలంగాణ-సంగారెడ్డి



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహెూన్నత సందేశ మన్నారు. దుర్మార్గం, నుంచి సన్మార్గానికి, అమానుషత్వం, నుంచి మానవత్వానికి, చెడు, నుంచి మంచికి, దురాశ, నుంచి భ్రాతృత్వం, త్యాగాలకు జీసస్ బాటలు వేశారన్నారు. క్రిస్మస్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది మనిషిని నిరంతరం సన్మార్గంలో నడిపించే దైవికమన్నారు.

పాము కాటుతో మహిళా మృతి

నవతెలంగాణ-మనూర్

ఇంట్లో ఉన్న ఓ మహిళను పాము కాటు వేయగా.. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ఘటన నాగలిగిద్దా మండలం కిషన్ నాయక్‌తాండాలో సోమవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌నాయక్‌తాండాకు చెందిన రాథోడ్ జేజీబాయ్(40) సోమవారం తన ఇంట్లో ఉండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. మృతురాలికి నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిది నిరుపేద కుటుంబమని.. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని తాండా వాసులు కోరారు.



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేకుల పంపిణీ

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గ్రామాల్లో క్రిస్టమస్ పండుగ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ చైర్మన్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ గ్రామానికి ప్రతీయేడు మాదిరిగానే ఈసారి కూడా మంగళవారం ప్రతీ చర్చికి కేకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోపాస్టర్ అనిల్ కుమార్,రాజు,ప్రవీణ్, ఎం.నర్సింలు తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ -కంగ్టి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మంగళవారం సర్వే జరిగిన తుర్కవడగామ, రాజారామ్‌తాండా, సుక్కల్‌తీర్థ్, గాజులపడ్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వేలో అర్హులైన వారి వివరాలు సేకరించి జాగ్రత్తగా యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈనెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేకులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-అమీన్‌పూర్

క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చర్చిలకు మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగా రెడ్డి మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకులను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అందజేసిన కేకులను పంపిణీ చేశారు. క్రైస్తవులందరూ ఆనందోత్సాహాలతో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పర్వదినాన్ని నిర్వహించుకోవాలని కోరారు. అందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రకళ గోపాల్, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, మహిపాల్ రెడ్డి,నాయకులు కొల్లూరి యాదగిరి, చర్చిల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



భవితలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెవరెండ్ డేనియల్ రాజు పాస్టర్, భవిత కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ బాలరాజు హాజరై వేడుకలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ధర్మాన్ని అనుసరించి నడుచుకోవాలని సూచించారు. అలాగే అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని నాటకం ద్వారా కళ్ళకు కట్టినట్లు విద్యార్థులు ప్రదర్శించారు. వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మధుకర్ రెడ్డి, రాజు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు, పరిశ్రమల భద్రత, రోడ్డు ప్రమాదాలపై

ప్రత్యేక దృష్టి

- ఎస్పీ చెన్నూరి రూపేష్
- వార్షిక తనిఖీల్లో భాగంగా బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ
- అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డుల పరిశీలన
- పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన ఎస్పీ





నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజలు, పరిశ్రమల భద్రత, రోడ్డు ప్రమాదలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని బీడీఎల్ భానూర్ పోలీసు స్టేషన్ ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సిబ్బంది టర్న్ అవుట్, పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది బ్యారెక్ పరిశుభ్రత, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డులు, అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను తనిఖీ చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని, యు.ఐ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండేలా చూడాలన్నారు. బిడియల్ హైదరాబాద్ పరీవాహక ప్రాంతం కావడం వలన భూసంబంధిత తగాదాలు అధికంగా ఉంటాయని సివిల్ కేసుల్లో జాగ్రత్తగా వ్యవహరిం చాలన్నారు. అధిక పరిశ్రమలు ఉండటం వలన ఇతర రాష్ట్రాల నుండి వచ్చే మైగ్రేట్ లేబర్ ఎక్కువగా ఉంటారని, ఎక్కువ దొంగతనాలు జరగడానికి అవకాశం ఉంటుందని, డే/రాత్రి బీట్ డ్యూటి, పెట్రోలింగ్ అధికారులు రౌడీ, కేడి, సస్పెక్ట్‌లను చెక్ చేస్తూ అనుమానస్పదంగా ఉన్న ప్రతి వ్యక్తులను చెక్ చేయాలన్నారు. తరుచూ వాహనాల తనిఖీ, నాకా బంది వంటి స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను/ వాహనాలను అదుపులోకి తీసుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ, కేడి, సస్పెక్ట్‌లను తరుచూ తనిఖీ చేస్తూ, ఆన్‌లైన్ రికార్డుల్లో అప్డేట్ చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు అండగా ఉండాలని సూచించారు. జిల్లాలో అల్ప్రాజోలం తయారి, నిషేదిత గంజాయి, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ అమ్మకాలు, అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు తావులేకుండా చూడాలన్నారు. సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, అన్ని అపార్ట్ మెంట్లు, పలు ప్రధాన కూడళ్లలో హై రెజల్యూషన్ కలిగిన సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాల న్నారు. ముఖ్యంగా జిల్లాలో అధిక సైబర్ నేరాలు బొల్లారం, అమీన్ పూర్ మరియు పటాన్ చెరు స్టేషన్ల పరిధిలో జరుగుతున్నాయని, కమ్యూనిటీ పోలిసింగ్, సోషల్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో నిబద్దతతో ఉండాలని తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారుల మన్ననలు పొందుతారని, చేసిన పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. విధి నిర్వహణలో క్రమ శిక్షణతో ఉండాలని, స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలన్నారు. పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ చాలా కీలకం అని, రోజు వ్యాయామం చేస్తూ ఫిట్ గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ ఎస్‌హెచ్ఓ స్వామి గౌడ్, ఎస్ఐ భారత్ బుషాన్, సిబ్బంది తదితరులున్నారు.

నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నిరుపేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ

నవతెలంగాణ-పటాన్‌చెరు

నిరుపేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఎండి గౌసియా బేగం భర్తను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అండగా నిలవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఆమె కోరగా.. కుట్టు మిషన్ కొనుగోలు చేసి అందించారు. ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్ కుమార్, ప్రమోద్ గౌడ్, సత్తయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.





సొంత నిధులతో చర్చిలకు కేకులు పంపిణీ..

నియోజకవర్గ పరిధిలోని 350 చర్చిలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సొంత నిధులతో కేకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతికి, ప్రేమకు క్రిస్మస్ పండుగ ప్రతీక అన్నారు. దశాబ్దకాలంగా నియోజకవర్గ పరిధిలోని ప్రతి చర్చికి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. సొంత నిధులతో నూతన చర్చిల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్య క్షులు నరసింహారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విభాగ శోధనకు ప్రాధాన్యం

- నైపుణ్యోపన్యాసంలో జార్జ్ వాషింగ్టన్ వర్సిటీ ప్రొఫెసర్ కౌసిక్ సర్కార్

నవతెలంగాణ-పటాన్‌చెరు



అంతర్ విభాగ పరిశోధన(ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్)కు ప్రాధాన్యం పెరుగుతోందని, అత్యాధునిక పరిశోధనలు అందుకు ఊతం ఇస్తున్నాయని అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయ మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కౌసిక్ సర్కార్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'రెండు అంశాల కథ: ఇమేజింగ్, థెరప్యూటిక్స్, టిష్యూ ఇంజనీరింగ్ కోసం బబుల్స్ (బుడగలు), విస్కోలాస్టిక్ మీడియంలో వినియోగం' అనే అంశంపై మంగళవారం నైపుణ్యోపన్యాసం చేశారు. ఈ రంగంలో తాను చేస్తున్న బహుళ విభాగ పరిశోధనలను వివరిస్తూ, ఆరోగ్య పరిరక్షణ, అంతరిక్షం (ఏరోస్పేస్)లో ఇంజనీరింగ్ అప్లికేషన్లు, వాటి భవిష్యత్తు గురించి ఆసక్తిని పెంపొందించారు. అల్ట్రాసౌండ్-సహాయక ఎముక, మృదులాస్థి కణజాల ఇంజనీరింగ్‌లో మైక్రోబబుల్, వాటి వినియో గాలను ప్రొఫెసర్ కౌసిక్ వివరించారు. ముఖ్యంగా త్రీడీ-ప్రింటెడ్ పరంజాల సందర్భంలో, చికిత్సా విధానాలను విప్లవాత్మకంగా మార్చడానికి, రోగి ఫలితాలను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతల సామర్థ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. నిర్దిష్ట క్లినికల్ ప్రయోజనాల కోసం బుడగలను రూపొందించడానికి ఇంజనీరింగ్ ను ఎలా ఉపయోగించవచ్చనే దానిపై డాక్టర్ సర్కార్ పలు అంతర్దృష్టులను, అంతర్ విభాగ స్వభావాన్ని నొక్కి చెప్పారు. తొలుత, గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ.అక్తర్ ఖాన్ అతిథిని స్వాగతించారు. ఏరోస్పేస్, మెకానికల్ ఇంజనీరింగ్ లోని అభివృద్ధి చెందుతున్న రంగాలలో ప్రొఫెసర్ కౌసిక్ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఏరోస్పేస్ ప్రొపల్షన్ సిస్టమ్స్ లో బబుల్ ఇమేజింగ్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తోందని డాక్టర్ ఖాన్ పేర్కొన్నారు. ఈ నైపుణ్యోపన్యాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పందులు, కుక్కల దాడులతో 'కంగ్టి పరేషాన్'

నవతెలంగాణ-కంగ్టి



పందులు, కుక్కల వరుస దాడులతో కంగ్టి మండల ప్రజలు భయాందోళనలో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇంటి ముందర కూర్చుని ఉన్న లాలప్ప అనే వ్యక్తిపై ఊర పంది దాడి చేసి గాయపర్చింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటినా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా నెలలోపు సుమారు నలుగురు వ్యక్తులు కుక్కలు, పందుల వల్ల గాయాలపాలవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై పంచాయతీ సెక్రెటరీకి పలుమార్లు చెప్పినా.. పట్టించుకోలేదన్నారు. దాంతో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని.. అయినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమైనట్టు నిమ్జ్ భూ నిర్వాసితులు, మామిడ్గి రైతులు స్పష్టం చేశారు. మండలంలోని మామిడ్గి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఐక్యమత్యంతో ఏదైనా సాధ్యమన్నారు. అందుకే భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమైనట్టు చెప్పారు. ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసిందని.. కానీ ఎట్టి పరిస్థితిల్లో భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. భూసేకరణకు ఇలాంటి ఎన్ని నోటిఫికేషన్లు వచ్చినా భయపడేది లేదన్నారు. పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు రాజిరెడ్డి, సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కల్లు దుకాణాలను మూసివేయాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



భానూర్ గ్రామంలో రెండు కల్లు దుకాణాలకే అనుమతులు ఉన్నప్పటికీ మరో ఐదు దుకాణాల్లో అక్రమంగా కల్లు విక్రయిస్తున్నా రని.. వాటిని వెంటనే మూసి వేయాలని గ్రామస్తులు నాగేష్ గౌడ్, రాములు, ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రెండు కల్లు దుకాణాలకు మాత్రమే అనుమతులున్నప్పటికీ.. గ్రామంలో విచ్చల విడిగా కల్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఎక్సైజ్ అధికా రుల దృష్టికి తీసుకెళ్లినా.. చూసిచూడనట్టు వ్యవహరిస్తు న్నారనారు. దుకాణాలను వేరొక వ్యక్తి తమ గ్రామంలో కల్లు దుకాణాలను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతూ తమ పొట్ట కొడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలను మూసివే యాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యలన్నింటినీ పరిష్కరించి.. 18 రోజులుగా వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్, సమగ్ర శిక్ష సిబ్బంది కలిసి కలెక్టరేట్ ఏవో పరమేశ్వరం కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. రేపు(గురువారం) ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాలో జిల్లా నుంచి పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్ మాట్లాడుతూ.. 23 ఏండ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి కనీస వేతనం చట్టం అమలుజేసి, వారి సేవలను క్రమబద్ధీకరించాలన్నారు. చాలీచాలని జీతంతో జీవితాలను వెళ్లదీస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని, ఆరోగ్య కార్డులు అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనం అమలు చేయాలని, కెజిబివి ప్రత్యేక అధికారులకు ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతల నుండి తప్పించాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల సెలవులు అనుమతించాలని, ప్రతీయేడు రెన్యూవల్ చేసే పద్ధతిని రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సంజీవయ్య, కంరోద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసా చారీ, పుండరీకం, జనార్ధన్, గోపాల్, సంతోష్ కుమార్, శివశంకర్, నర్సింలు, మల్లేశం, ప్రకాష్, సుభాష్ రావ్, శేషాద్రి, అనిల్ చారీ, మీరాబాయి, కవిత, సంగీత, స్వాతి, సులోఖ,మహ్మదీ బేగం, ప్రణీత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు



నవతెలంగాణ-సంగారెడ్డి

హ్యాండ్ బాల్ అసోసియేషన్ మెదక్ జిల్లా సెక్రటరీ విజయకుమార్ పర్యవేక్షణలో జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపికలు చేశారు. అందులో బాలుర విభాగంలో సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మొదటి స్థానంలో, బాలికలు విభాగంలో నలుగురు విద్యార్థులు రెండో స్థానంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ కే. అంతోనిరెడ్డి మాట్లాడుతూ అరవింద్, మధు, నవదీప్, మృదుల, కృప, అక్సృత, కావేరీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆటలు మానసిక వికాసానికి, దేహదారుడ్యానికి ఎంతో అవసరమన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు హర్షం వ్యక్తం చేశారు. అందుకు సంపూర్ణ కృషి సహకారం అందించిన పిఈటి మాస్టర్ విశాల్, సంతోష్‌లను అభినందించారు.

వికలాంగుడికి పులిమామిడి రాజు చేయూత

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలోని డబల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి చెందిన బొంతపల్లి సంగమేశ్వర్ అనే యువకుడు కొన్నేండ్ల క్రితం ఇస్నాపూర్ సమీపంలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఉపాధిని కోల్పోయ్యాడు. దాంతో అతడు కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి మామిడి రాజును సంప్రదించగా.. ఆయన వెంటనే తగిన సాయాన్ని అందించారు. ఈ క్రమంలో సంగమేశ్వర్ ఈకో ఎలక్ట్రికల్ వాహనాన్ని కొనుగోలు చేసి.. వాహనాన్ని ప్రారంభించడానికి పులిమామిడి రాజును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. దాంతో పులిమామిడి రాజు మంగళవారం రోజున ఆ వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా జీవనోపాధి కల్పించుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సహాయానికిగాను వారి కుటుంబ సభ్యులు పులిమామిడి రాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు నితిన్ స్వామి, రాగం అనిల్ స్వామి, బొంతపల్లి ఈశ్వరమ్మ, స్వరూప, సంగప్ప, తాలెల్మ రాము, సోమ శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్



పట్టణ పరిధి అల్లిపూర్ శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. అందంగా అలంకరించిన పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, నక్షత్రం సమక్షంలో క్రీస్తు పుట్టుక ఔనత్యాన్ని విద్యార్థులు నాటిక, నృత్యాల రూపంలో అత్యద్భుతంగా ప్రదర్శించారు. సెమీ క్రిస్మస్ వేడుకను పురస్కరించుకొని కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. శాంటా క్లాస్ నృత్యం చేస్తూ చాక్లెట్లు పంచుతూ విద్యార్థుల మధ్య సందడి చేశాడు. పాస్టర్ ప్రసన్న కుమార్ క్రీస్తు గురించి విలువైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల చైర్మెన్ వేది అశోకొరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాంప్రదాయాలను తెలియపరిచేందుకే అన్ని సంస్కృతుల కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ దినేష్, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్యూరి నరసింహారెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్యూరి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ పిలుపు మేరకు పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం.. అలాగే ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై బీజేపీ ఎంపీలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమన్నారు. ముఖ్యంగా రాజ్యాంగం మార్చే పనిలో ప్రధాని మోడీ బీజేపీ ప్రభుత్వం ఉన్నదని.. బాబాసాహెబ్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు. దానిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీ వరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ డైరె క్టర్‌అతిక్, యువరాజ్ మోరే, నరేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
3
బుధవారం | 25 డిసెంబర్ 2024 | www.navatelangana.com

సర్పంచుల సమస్యలపై ప్రశ్నించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్రంలోని సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం వారి పెండింగ్ బిల్లులు వచ్చే విధంగా శాసనమండలిలో గళమెత్తాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎమ్మెల్సీ కవితను కోరారు. మంగళవారం మనోహరాబాద్ మండల మాజీ సర్పంచ్లతో కలిసి బీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు రావలసిన పెండింగ్ బిల్లుల గురించి శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరినట్టు ఆయన తెలిపారు. అలాగే మనోహరాబాద్ మండల్‌కు ఒక్కసారి రావాలని వారు కోరినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ కవితను కలిసినవారిలో పార్టీ రాష్ట్ర నాయకులు నాచారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరితోపాటు మనోహరాబాద్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు బిఆర్ఎస్ కుచారం గ్రామ కమిటీ అధ్యక్షులు దాసరి నరేష్ ముదిరాజ్, దండుపల్లి నాయకులు పంజా బిక్షపతి ముదిరాజ్, రంగయ్య పల్లి మాజీ సర్పంచ్ నాగభూషణం ముదిరాజ్ , నాయకులు జీడిపల్లి కుంట రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనాలు ఏర్పాటు చేసిన కెవికే సిబ్బంది ఆర్ఎస్ఎస్

- చాయ్ బిస్కెట్ వార్తకు స్పందన



నవతెలంగాణ-కౌడిపల్లి

ఎట్టకేలకు భోజనాలు ఏర్పాటు చేసిన కేవీకే సిబ్బంది ఆర్ఎస్ఎస్, చాయ్ బిస్కెట్ తోనే సర్దుకు పోవాలా అనే శీర్షికకు కెవికె సిబ్బంది స్పందించారు. మంగళవారం ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు చూస్తున్న జిల్లా అధికారులకు, పోలీసులకు కేవికే సిబ్బంది, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. కేవికే సిబ్బంది మాట్లాడుతూ బుధవారం రోజు కూడా మధ్యాహ్నం పులిహెూర ప్యాకెట్లు వచ్చిన రైతులకు అందజేస్తామని వారు తెలిపారు

మెదక్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రూ. 100 కోట్లు కేటాయించాలని బిఆర్ఎస్ మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని కలిగి ఉన్న మెదక్ పట్టణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మెదక్ పట్టణ ప్రజలు చిరకాల కోరిక అయిన ఔటర్ రింగ్ రోడ్డు కోసం స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ఇవ్వాలని కోరారు. చర్చి ఉత్సవాలకు వస్తున్న ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తామని ఆయన తెలిపారు.

మెదక్ చర్చి సందర్శనకు 25న కవిత రాక

నవతెలంగాణ- మెదక్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని సందర్శించేందుకు ఈ నెల 25వ తేదీన కల్వకుంట్ల కవిత రానున్నారని ఐదవ వార్డ్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి 11 గంటల వరకు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-మనోహరాబాద్

మున్సిపల్ కేంద్రంలోని ఏడవ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు క్రిస్మస్ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ ఇందిరా చిన్నారుల చేత క్రిస్మస్ తాత వేషధారణలో వేయించారు. చిన్నారులకు క్రిస్మస్ పండగ విశిష్టతను అర్థమయ్యే విధంగా వారికి తెలియజేశారు. ఏసుక్రీస్తు ప్రబోధించిన శాంతి సహనంపై చిన్నారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బందితోపాటు చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్టమస్ ఫిస్ట్ వేడుకలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని సాయి కృష్ణ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ ఫిస్ట్ వేడుకలు క్రిస్టియన్స్ సోదరులు ఘనంగా క్రిస్టమస్ ఫిస్ట్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జములా నాయక్ హాజరై ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదరులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పండుగలు శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరు కలిసి మెలిసి జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండి ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ సిద్ధిరామిరెడ్డి, పాస్టర్స్ రేవా, సందీప్ కుమార్, లక్ష్మణ్ పాల్, దేవదాస్ పాల్, తిమోతి, మోజేష్, అమోస్పాల్, కిరణ్, సాగర్, జాన్ వివిధ మండలాల పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాగి ఆకుపై ఏసుక్రీస్తు బొమ్మ



నవతెలంగాణ-మనోహరాబాద్

క్రిస్టియన్ సోదరుల పవిత్ర పండగ అయిన క్రిస్మస్‌ను పురస్కరించుకొని మనోహరాబాద్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో చిత్రలేఖన ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మేడోజి బ్రహ్మాచారి రాగి ఆకుపై ఏసుక్రీస్తు చిత్రపటాన్ని చిత్రించారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకొని రాగి ఆకుపై ఏసుక్రీస్తు చిత్రపటాన్ని చిత్రించి క్రిస్టియన్స్ సోదరులకు క్రిస్టమస్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నర్సాపూర్

కౌడిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రూ.1, 12,500లు సీఎం ఆర్ఎఫ్ కింద మంజూరు కాగా, చెక్కులను మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అంజనేయులు గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డిలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మల్లేశం, ఉదయ్ కుమార్, హరీష్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-వెల్దుర్తి

పనికి వెళ్లకుండా స్నేహితులతో తిరుగుతున్నాడని తండ్రి మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం బొమ్మరం గ్రామానికి చెందిన కర్ణ ప్రశాంత్ (22) రోజువారీ కూలీ చేసుకుంటూ జీవనం సాగించేవారు గత కొన్ని రోజులుగా పనికి పోకుండా స్నేహితులతో తిరుగుతూ ఉండడంతో అతని తండ్రి రామస్వామి మందలించాడని తెలిపారు. తండ్రి మందలించడంతో ఈ నెల 17వ తేదీ రాత్రి సమయంలో గ్రామంలో కల్లు దుకాణం వద్ద ఏదో గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి సమాచారం అందించారు. వెంటనే తండ్రి రామస్వామి కుమారుడు ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం మృతుని తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం జెడ్పీ సీఈఓ తనిఖీ చేశారు. మండల కేంద్రం నుంచి వచ్చిన 1852 దరఖాస్తుల పై 4 టీంలు సర్వే నిర్వహిస్తుండగా, మండల పరిధిలోని గ్రామ పంచాయితీల నుంచి వచ్చిన 2429 దరఖాస్తులను పంచాయితీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఈఓ సీ.హెచ్ ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన నిర్దిష్ట గడువు డిసెంబర్ 30వ తేది వరకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అన్ని వివరాలను నమోదు చేయాలని సర్వేయర్లకు సూచించారు. సర్వర్ వేగం తక్కువగా ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సర్వే మందకొడిగా సాగుతుందని తెలిపారు. సర్వర్ వేగంగా ఉంటే సర్వే త్వరగా పూర్తి చేయడానికి వీలవుతుందన్నారు. స్పందించిన సీఈఓ సర్వర్ వేగంలో ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆనంద్, నార్సింగి పంచాయితీ కార్యదర్శి నాగభూషణం, సర్వేయర్ లు ఉన్నారు.

ఉపాధి లేని మెదక్ జిల్లా

- ఆర్మూర్ టు హైదరాబాద్ వలసలు
- ప్రధాని అందించిన మెదక్ జిల్లాకే దిక్కులేదు
- సీఎం ప్రత్యేకమైన ప్యాకేజీ ఇవ్వండి
- కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి చూపాలి





నవతెలంగాణ-మెదక్

అన్నింటిలో వెనుకబడిన మెదక్ జిల్లా సీఎం రాక కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తోంది. ఇన్నాళ్లు వివక్షకు గురైన ప్రాంతం ఉమ్మడి మెదక్ జిల్లాలో పేరుకు మాత్రం మెదక్ జిల్లాగా ఉండి సంగారెడ్డి అభివృద్ధి చెంది ప్రత్యేకమైన జిల్లాగా ఏర్పడింది. గతంలో జిల్లా కేంద్రం మెదక్ అయినప్పటికీ అభివృద్ధిలో నిధులలోనూ తీవ్ర వివక్షకు గురైంది. ఈ నెల 25వ తేదీన మెదక్ చర్చిలో వందసంవత్సరాల ఉత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించి సిద్దిపేట, సంగారెడ్డిల కంటే మెదక్ జిల్లాను ఉన్నతమైన స్థానంలో నిలుపుతారని ఇక్కడి ప్రజలు ఆశ పడుతున్నారు. మెదక్ నుంచి పోటీ చేసి దేశానికి ప్రధాని అయిన ఇందిరాగాంధీ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని కంపెనీలను మంజూరు చేస్తే అవి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. ఫలితంగా ఇక్కడి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేకపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మెదక్ జిల్లాకు మోక్షం కలుగుతుందని భావిస్తున్నారు. మెదక్ ప్రాంత ప్రజలు క్రిస్మస్ పర్వదిన పురస్కరించుకొని సీఎం హెూదాలో రేవంత్ రెడ్డి మెదక్‌కు వస్తుండడంతో, మెదక్ ప్రాంత ప్రజానీకానికి ఉపాధి చూపేందుకు కంపెనీలు ఏర్పాటు చేస్తారని ఆశపడుతున్నారు. మెదక్ చర్చి నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో ముఖ్యఅతిథిగా నిర్మాణ ప్రదాత చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు వస్తున్నారు. ఇంతకాలం అనేక రకాల నిరాశకు గురైన మెదక్ ప్రాంతం సీఎం రేవంత్ రెడ్డి రాకతో మెదక్ ప్రాంత యువత ఉపాధి కలుగుతుందని ఆశపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఆదరించి దేశానికి ప్రధానిని అందించిన మెదక్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని మెదక్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఆయన రాకతోనైనా మెదక్ జిల్లా ప్రజలు ఉపాధి పొందుతురని ఆశిద్దాం....!

మెదక్‌లో ఉపాధి లేక అల్లాడుతున్న ప్రజలు

దశాబ్దాల పాటు వివక్షకు గురైన మెదక్ జిల్లాలోని ప్రజలు జిల్లా కేంద్రం ఏర్పాటు కావడంతో మురిసిపోయారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుతోనే సైతం తమకు ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డారు. కానీ అలాంటివి ఏమీ జరగకుండానే ఉపాధి కోసం ఆర్మూర్ నుండి హైదరాబాద్ వరకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మెదక్‌లో పనులు లేవు బతకడం కష్టంగా ఉందని, ప్రతి నెల చిట్టీలు కట్టాల్సిన పరిస్థితి ఉండడంతో వలసలు వెళ్ళవలసిన పరిస్థితి ఉంటుండడంతో పిల్లలను, పెద్దలను వదిలేసి ఆర్మూరు, హైదరాబాద్‌లకు వలసలు వెళ్లి కష్టం చేసుకుంటున్నారు. ప్రధానంగా పురుషులకు, యువతకు పనులు లేకపోవడం మూలంగా హైదరాబాద్‌కు ఎక్కువ మంది వలసలు వెళు తున్నారు మెదక్‌లో కనీసం వెయ్యి మందికి పని కల్పించే కంపెనీ లేకపోవడం పట్ల ఎంతోమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు బ్రతకడం చాలా కష్టంగా మారుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫారెస్ట్ నుంచి మట్టి రవాణాను అడ్డుకున్న అధికారులు

- రవాణా జరగకుండా కందకాలను తవ్విన అటవీ అధికారులు
- అటవీ ప్రాంతం గుండా రవాణా చేస్తే కఠిన చర్యలు
- తూప్రాన్ అటవీ శాఖ రేంజర్ అంబర్ సింగ్



నవతెలంగాణ-మనోహరాబాద్

అటవీ ప్రాంతం గుండా ఎలాంటి అక్రమ రవాణాలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తూప్రాన్ ఫారెస్ట్ రేంజర్ అంబర్ సింగ్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామ శివారు నుంచి కొందరు వ్యక్తులు మట్టి రవాణాను చేపడుతున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం రవాణాలు అడ్డుకట్ట వేయడానికి కందకాలను తవ్వారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వం టీఎస్ఐఐసి ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేస్తుంది. పరిశ్రమలకు మట్టి అవసరం కావడంతో కొందరు వ్యక్తులు మట్టి మాఫియాగా ఏర్పడి టిప్పర్ల ద్వారా పరిశ్రమలకు మట్టిని తరలిస్తున్నారు. కాగా కొందరు వ్యక్తులు మట్టి రవాణాకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నప్పటికీ అటవీ ప్రాంతం గుండా చెట్లను చదలు చేసి రోడ్డును ఏర్పాటు చేసుకొని అత్యధికంగా వాహనాలతో మట్టిని తరలిస్తున్నారు. అటవీ ప్రాంతం గుండా మట్టిని తరలిస్తున్నట్టు అటవీ అధికారులకు అదే గ్రామానికి చెందిన కొందరు సమాచారం అందించడంతో తూప్రాన్ అటవీ శాఖ అంబర్ సింగ్ ఆదేశాలతో డిప్యూటీ రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రోడుకు ఇరువైపులా జెసిబి యంత్రంతో పెద్ద ఎత్తున కందకాలను తవ్వించారు. అలాగే ఎవరైనా అటవీ ప్రాంతం గుండా రవాణా చేపడుతున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

జమిలి ఎన్నికలు అనర్ధదాయకం

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చేర్మెన్. ర్యాకం శ్రీరాములు



నవతెలంగాణ-నిజాంపేట : జమిలి ఎన్నికలు అనర్ధదాయకమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మెన్ ర్యాకం శ్రీరాములు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒకే సారి అన్ని ఎన్నికలు పూర్తి చేయాలనుకోవడం అరంభంలో సాధ్యం అయినట్టుగా భవిష్యత్తు ఎన్నికలు కూడా అదే తీరుగా జరిగే అవకాశం వుండదన్నారు. మధ్యలో ప్రభుత్వం పడిపోయిన సందర్భంలో ఎన్నికలకు వెళ్ళాల్సి వస్తే మిగిలిన గడువుకు మాత్రమే ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జమిలీ అనేది జంబ లకిడి పంబ అయి తే మధ్యంతర ఎన్నికలు వస్తే పంబ లకిడి జంబగా మారుతుందన్నారు. పార్టీ ఫిరాయింపులతో ఆర్థికనేరగాళ్ళతో అలవిమాలిన తనంగా నిండిపోతన్న చట్ట సభ లు జమిలీతో మరింత నేతిబీర అవుతాయన్నారు. రాజ్యాం గ స్ఫూర్తికి బీటలు వారే అప్రజాస్వామిక విధానాలు జమిలీ వ్యవస్థలో ఎదురవుతాయన్నారు. భారత దేశంలో నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియ నిర్వహణ లేకుంటే నియంతృత్వ పోకడలు ఏర్పడి వినాశనానికి దారి తీస్తాయన్నారు.

గీతా స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని గీతా హైస్కూల్లో గీత స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కాంతులు విరజిమ్మే క్రిస్మస్ ట్రీ,పశువుల పాకలో ఏసు జననం,మేరీ మాత,క్రిస్మస్ తాతయ్యల ఆనందహేల వెరసి ఆద్యంతం అత్యంత ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన క్రిస్మస్ వేడుకలకు తూప్రాన్ గీతా స్కూల్ వేదికైంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ సర్వజనహితమే మన మతమని, మానవాళికి క్రీస్తు అందించిన సందేశం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ పి.ఉష,డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్,నారాయణ గుప్త,ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్,ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు



నవతెలంగాణ-శివ్వంపేట

అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో బగలాముఖీ అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో బగలాముఖీ అమ్మవారికి మహాపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహా పూజలతో పాటు రుద్రయామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వహిం చడమే కాకుండా అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నానా విధఫలాలతో నైవేద్యం సమర్పిం చారు. బగలాముఖీ అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రతివారం మాదిరిగానే అమ్మవారి భక్తుడు కొడకంచి సుదర్శన్ గౌడ్ పులిహెూర ప్రసాదం అందజేశారు. మహాపూజలలో బగలాముఖీ శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్, ట్రస్ట్ అధికార సభ్యులు సూర్యకుమార్ గౌడ్, కొడకంచి సుదర్శన్ గౌడ్, బుర్ర మహేష్ గౌడ్, కొత్తపేట నర్సిములు, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, కిషన్, పాల్గొన్నారు.

కమనీయంగా రేణుక ఎల్లమ్మకు బోనాలు

- తిమ్మాపూర్‌లో మూడు రోజుల పాటు సాగిన బంగారమ్మ జాతర
- ఊరిలో నుంచి ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు



నవతెలంగాణ-శివ్వంపేట

ఊరు ఊరంతా పండగలా ఆనందోత్సవాల మూడు రోజుల పాటు సాగిన తిమ్మాపూర్ శ్రీబంగారమ్మతల్లి జాతర ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు కమనీయంగా, కన్నుల పండుగగా సాగాయి. డప్పు చప్పుల్ల మధ్య ఊరిలో నుండి ఊరేగింపుగా మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని తిమ్మాపూర్ గేటు వద్ద గల రేణుక ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాల నైవేద్యం సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే ఎల్లమ్మ తల్లికి మేకపోతులు, కోళ్లు, కొబ్బరికాయలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తాజా మాజీ సర్పంచ్ అనూష అశోక్ గౌడ్, తాజామాజీ ఉపసర్పంచ్ పోల్దాస్ సంధ్య వెంకటస్వామి మాటా్లడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు మండల ప్రజలతో పాటు తిమ్మాపూర్ గ్రామస్తులపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. మాజీ సర్పం చులు కొడకంచి బిక్షపతి గౌడ్, అంజాగౌడ్, వీరప్పగారి శంకర్, నాయకులు ఎంచర్ల లింగం,బీర్తి రాములు, గుణంగారి పోచయ్య, రాసుపల్లి బిక్షపతి, పోచయ్య ముత్యాలు, ఎంచర్ల రాములు, డీలర్ కొమురయ్య కుమార్ యాదవ్, గుణంగారి రాజు,గ్రామస్తులు పాల్గొన్నారు.

పదేళ్లలో జరగని అభివృద్ధి సంవత్సరంలోనే జరుగుతుందా?

- అమర సేనా రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని మాజీ మంత్రి ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అనడం హాస్యాస్పదమని రామయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రావిపల్లి అమర సేనా రెడ్డి అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో మెదక్ నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరంలోనే అభివృద్ధి ఎలా జరుగుతుందో హరీష్ రావు చెప్పాలన్నారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే యువ నాయకుడు మైనంపల్లి రోహిత్ రావు అనతి కాలంలోనే మెదక్ చర్చికి రూ.29.18 కోట్లు మంజూరు చేయించారన్నారు. మెదక్ పట్టణంలో మెడికల్ కాలేజీ ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గతంలో రోగులకు గోళీలు మందులు కావాలంటే సంగారెడ్డికి వెళ్లే పరిస్థితి ఉండేది ప్రస్తుతము మెదక్ పట్టణంలోనే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయించిన ఘనత కూడా రోహిత్ రావుకే దక్కిందన్నారు. లింగం గౌడ్ మాట్లాడుతూ గతంలో మండల కేంద్రం నుండి నస్కల్ రోడ్డుకు మంజూరు అయిందని చెప్పి ఇప్పటికీ పనులు జరగడం లేదని చల్మెడ రోడ్డు పనులు కూడా మధ్యలో ఆపివేయడం జరిగిందన్నారు. రైతు బంధు కూడా జనవరి నుండి వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, మహేందర్, నసీరుద్దీన్ , రవీందర్ రెడ్డి , రామవత్ రాజు, నాగరాజు, స్వామి, భూమా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి







నవతెలంగాణ- కౌడిపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 25వ తేది పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా యూత్ నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ముఖ్యమంత్రి స్థాయిలో మెదక్ జిల్లాకు మొట్టమొదటిసారిగా వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలకాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకులు ఏకపక్షంలో ఉండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర జిల్లాకు అధిక నిధులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణతో మెదులుకోవాలని వారు సూచించారు. ఏడుపాయల వన దుర్గ మాత దర్శనంతో పాటు మెదక్ చర్చ్ 100 సంవత్సరాలు అయిన సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలలో సీఎం పాల్గొంటారని తెలిపారు.

నవతెలంగాణ-శివ్వంపేట

క్రిస్మస్ వేడుకలు, వందేళ్ల చర్చి పండగ, ఏడుపాయల వనదుర్గాభవాని మాత దర్శనం కోసం మెదక్ జిల్లా పర్యటనకు నేడు విచ్చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త విజ్ఞప్తి చేశారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన రవీందర్



నవతెలంగాణ-శివ్వంపేట

సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం తాళ్లపల్లి తండాకు చెందిన రవీందర్ ఎంపికయ్యారు. దనావత్ టిక్యా, దుర్గమ్మ దంపతుల కుమారుడైన రవీందర్ చిన్ననాటి నుండే క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూనే, ఖోఖో ఆటలలో మంచి ప్రావీణ్యం సంపాదించి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో పోటీలలో విజేతగా నిలిచి, ఎన్నో బహుమతులు, పథకాలు సాధించి, ఖోఖోలో మండలానికే మకుటం లేని మహారాజుగా నిలిచారు. రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైన రవీందర్ కు తాజామాజీ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, గౌడసంఘం మండల అధ్యక్షులు రవీందర్ గౌడ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి, ప్రధానకార్యదర్శి గుల్లయ్యగారి సుదర్శన్, గిరిజన సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షులు సూర్యం చౌహాన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు తిరుపతి రాథోడ్ ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ మండల ప్రధానకార్యదర్శి సంతోష్ కుమార్

నవతెలంగాణ-శివ్వంపేట

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వరగంటి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్, ప్రధానకార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ అయిన సమాన పనికి సమాన వేతనం, ఆరోగ్య భద్రత , భీమా సౌకర్యం, వెంటనే మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి 14 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మెను విరమింప చేయాలని కోరారు. జిల్లా కౌన్సిలర్ ఇందుమతి మాట్లాడుతూ ఐక్యంగా పోరాడి ఉద్యోగులు డిమాండ్‌లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమ్మె శిబిరానికి కౌన్సిలర్ ఇందుమతి ఆర్థిక సహాయం కూడా అందచేయడం జరిగింది.



నవతెలంగాణ
సిద్దిపేట
బుధవారం | 25 డిసెంబర్ 2024 | www.navatelangana.com

గౌడ జనహక్కులను కాపాడుకుందాం



- వర్కింగ్ ప్రెసిడెంట్ రేఖ గౌడ్

నవతెలంగాణ-గజ్వేల్

గౌడ జన హక్కులను కాపాడుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగోని రేఖ గౌడ్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గౌడ జన హక్కుల కోసం పోరాడేందుకు మహిళా శక్తిని ముందుకు తీసుకొస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గౌడ జన హక్కుల పోరాటంలో మహిళలకు అవకాశాలు ఇస్తున్నామని ఆమె చెప్పారు. పలువురు మహిళలకు బాధ్యతలు అప్పగిస్తూ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ నియామక పత్రాలు అందజేసినట్లు ఆమె చెప్పారు. అనంతరం రేఖ గౌడ్‌కు శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేసిన గౌడ సంఘం నాయకులు, మహిళలు సన్మానం చేశారు. అంతకుముందు చేగుంట మండలం కర్నాల్ పల్లి ఎల్లమ్మ టెంపుల్ వద్ద సమావేశం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ జనరల్ సెక్రెటరీ సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ముత్యం నర్సింలు గౌడ్, బాలరాజ్ గౌడ్, పచ్చిమట్ల స్వామి గౌడ్, భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం బైక్ ర్యాలీ



నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మద్దూరు జేఏసీ కన్వీనర్ రామడుగు బాలరాజు ఆధ్వర్యంలో చేర్యాల నుండి సిద్దిపేట కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి మద్దూరు నుంచి వివిధ పార్టీల నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలిత మల్లేశం గౌడ్, మండల కార్యదర్శి బూర్గు శంకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు పరమేశ్వర్, సత్యనారాయణ, కనక చంద్రం,ఇండ్ల చంద్రమౌళి, మీసా సత్యనారాయణ, పుల్లూరి రాజు, నీరటి కిషోర్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఇంటిలో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ పట్టణంలో బాల యేసు పుణ్యక్షేత్రం సైతం ప్రసిద్ధిగాంచిందని వివిధ రాష్ట్రాల నుంచి గజ్వేల్‌లో ఉన్న బాల యేసు పుణ్యక్షేత్రానికి క్రిస్మస్ వేడుకల సందర్భంగా కదిలి వస్తారని ఆయన అన్నారు.

చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణం

- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్



నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట వాసవి క్లబ్, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద ఐదుగురు ఆర్యవైశ్యులకు చిరు వ్యాపారం చేయుటకు ఒక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.1,25,000 వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా వచ్చిన వడ్డీ లేని చెక్కులను అందించడం జరిగిందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొనుటకు సరస్వతి పథకం కింద టెక్స్ట్ బుక్స్, ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందని, అదేవిధంగా స్వయం ఉపాధి కింద వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఐదుగురు పేదవారికి చెక్కుల అందించడం జరిగిందని, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా ఈ సంవత్సరం సుమారు 1000 కుట్టు మిషన్లు అందించడం జరిగిందన్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, వివిధ క్లబ్బుల ద్వారా ప్రతి ఏటా రూ.50 కోట్లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట వాసవి క్లబ్ అధ్యక్షులు చేకిలం రవి, యూత్ క్లబ్ అధ్యక్షులు అరవపెల్లి హరికిరణ్, ప్రధాన కార్యదర్శులు తోట విశ్వం, బుక్కశివ, కోశాధికారి ఇల్లందుల నాగేందర్, వీఆర్వో సోమ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా వైకుంఠం



నవతెలంగాణ-దౌల్తాబాద్

తెలంగాణ చేనేత ఐక్యవేదిక దౌల్తాబాద్ మండల అధ్యక్షులుగా చిలుక వైకుంఠం నియామకమయ్యారు. ఈ మేరకు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వైకుంఠం మాట్లాడుతూ చేనేత కార్మికుల బతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని ఉపాధి లేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. చేనేత కార్మికుల హక్కులు, చైతన్యం కోసం చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్, జిల్లా అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామకోటి సంస్థ ఆధ్వర్యంలో రామ, శివ లిఖిత యజ్ఞం



నవతెలంగాణ- సిద్దిపేట

పట్టణంలోని ప్రసన్నాంజనేయ దేవాలయంలో శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆధ్వర్యంలో 108 రామ, శివ లిఖిత నామాలు లిఖించి, అక్కడే ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి నిర్విరామంగా చేస్తున్న ఆధ్యాత్మిక సేవను గుర్తించి ఈ అవకాశం ఇచ్చిందన్నారు. రామకోటి సంస్థ నుంచి కోట్లాది లిఖిత సంఖ్యను శృంగేరి పీఠానికి అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు శ్రీనివాసాచారి, చంద్రమౌళి, అర్చకులు వెంకటరమణ చార్యులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ మూడో వార్డులో పేద కుటుంబానికి చెందిన కంకణాల ప్రమీల కనకయ్య దంపతుల చిన్న కుమార్తె అనిత వివాహానికి ఆ వార్డు కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి మంగళవారం ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని, వారికి అండగా తాను ఉంటానని భరోసానిచ్చారు. వారి వెంట నాయకులు కొండే ఎల్లారెడ్డి, శ్రీ రాజ్, కంకణాల బాబు, ఆకుల నరేష్, సత్తు విష్ణువర్ధన్ రెడ్డి, కనకయ్య, అశోక్, ఆకుల నారాయణ, శ్రీనివాస్, కనకయ్య, రాజు, శివ ఉన్నారు.

చీకటిలో కాంతికి ప్రతీక 'క్రిస్మస్'..

- నేడు ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినం
- వెలుగులతో ముస్తాబైన మండలంలోని చర్చిలు

నవతెలంగాణ-బెజ్జంకి

శీతాకాలంలో చీకటిలో చలి తీవ్రత మరింత ఉధృతంగా ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో యేసు క్రీస్తు జన్మించిన సందర్భంగా ఆకాశంలో చుక్క వెలియండంతో చీకటిలో కాంతి వెలువడిందని.. చీకటిలో కాంతికి ప్రతీకగా యేసు క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు ఆనందోత్సహాలతో ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగను చేసుకుంటారు. మండలంలోని అయా గ్రామాల్లో క్రిస్మస్ పండుగ వేడుకలకు చర్చిలు వెలుగులతో ముస్తాభయ్యాయి.

క్రిస్మస్ విశిష్టత

క్రిస్మస్ అంటే యేసు క్రీస్తు జన్మించిన రోజుతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగియుంది. సమాజంపై ప్రేమ,కరుణ,ఆదరణ, నిస్వార్థత వంటి సద్భావన విలువలను ప్రతిబింబిస్తుంది. దయ, దాతృత్వం వంటిని ప్రేరేపిస్తుంది.యేసు క్రీస్తు జననం ప్రత్యేక విశిష్టతను చాటుతుంది.

ప్రత్యేకార్షణగా క్రిస్మస్ చెట్టు..

చర్చిల్లో క్రిస్మస్ చెట్టు ప్రత్యేకార్షణగా నిలుస్తాయి.క్రిస్మస్ చెట్టు ప్రతిష్టాత్మకమైన సంప్రదాయలకు శాశ్వత జ్ఞాపకాలను సృష్టిస్తుంది.

వెలుగును పంచుకోవడమే క్రిస్మస్

ముక్కీస రత్నాకర్ రెడ్డి,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు,బెజ్జంకి.



క్రిస్మస్ పండుగ ప్రపంచ వ్యాప్తంగా ఆనందోత్సహాలతో జరుపుకునే పండుగ. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో యేసు క్రీస్తు జన్మదినాన్ని చేసుకుంటారు. యేసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం.

సుసంపన్నమైన కీర్తిని చాటుతుంది.

ఒరుగంటి ఆనంద్,ఆహార భద్రత మండలి సభ్యుడు.



క్రిస్మస్ ప్రపంచ స్థాయిలో సుసంపన్నమైన కీర్తిని చాటుతోంది. అంతర్జాతీయ స్వభావమైన ప్రేమ, దయ, కరుణ సార్వత్రికను ప్రదర్శిస్తుంది. ప్రపంచ శాంతి..ఐక్యతను గుర్తుచేస్తుంది. గతాన్ని ప్రతిబింబించేల వర్తమానానికి కృతజ్ఞతను తెలియజేస్తుంది. కుల, మత,వర్గాలకు అతీతంగా క్రిస్మస్ పండుగ ఆనందోత్సహాలతో నిర్వహించుకోవాలి.

తడి పొడి చెత్తతో సేంద్రియ ఎరువు

- కమిషనర్ రమేష్



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ప్రతిరోజు సేకరించే తడి పొడి చెత్తను లచ్చపేట 10 వ వార్డులో ఉన్న డీఆర్ సీసీ కేంద్రం ద్వారా సేంద్రీయ ఎరువును తయారు చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ తెలిపారు. చెత్త రహిత స్వచ్ఛ దుబ్బాకగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. మంగళవారం డీఆర్ సీసీ కేంద్రంలో తడి పొడి చెత్తను వేరు చేయుట, వాటి నిర్వహణ ప్రక్రియను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ ప్రజలు చెత్తను బహిరంగంగా ప్రదేశాల్లో వేయకుండా తడి పొడిగా వేరుచేసి మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. కమిషనర్ వెంట సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, ఇన్చార్జి శానిటరీ ఇన్ స్పెక్టర్ దిలీప్,మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మల్లన్న కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న కళ్యాణం సమీపిస్తున్న ఏర్పాట్లు మాత్రం నామమాత్రంగా కొనసాగుతున్నాయని వెంటనే ఏర్పాట్లు పూర్తి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్‌తో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న నిర్వహించే మల్లన్న కళ్యాణం కొరకు ఏర్పాట్లు నత్త నడకన సాగుతున్నాయని, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కొమురవెల్లికి వచ్చిన సందర్భంలో 25వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించిన స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కళ్యాణానికి వచ్చే భక్తుల కొరకు పార్కింగ్ సౌకర్యం, త్రాగునీరు, పరిసరాలను పరిశుభ్రం చేయడం, లాంటి సౌకర్యాలు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తుల నుంచి వచ్చే ఆదాయం మీద ఉన్న శ్రద్ధ వాళ్లకు కల్పించే ఏర్పాట్లపై లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తేలు ఇస్తారి, సార్ల యాదయ్య తాడురి భరత్ కుమార్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ హయంలోనే కార్మిక సంక్షేమం

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్ హయంలోనే కార్మిక సంక్షేమం కోసం కృషి జరిగినట్లు ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కార్మికుడు జంగా యాదగిరికి ఆసుపత్రి ఖర్చుల కింద రూ.50 వేలను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల కోసం ప్రత్యేక ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసిందని, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన యాదగిరికి ఆసుపత్రిలో అనేక ఖర్చులు అయినట్లు ఆయన చెప్పారు. ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఈ డబ్బులను అందించినట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజ మౌళి, బీఆర్ఎస్ కె నాయకులు నాగేష్ కుమార్, కనకయ్య, మల్లేశం, రాజు, రఫీ, డేవిడ్, దేవేందర్, కౌన్సిల్ సభ్యులు అత్తిలి శ్రీనివాస్, గుంటుకు శిరీష రాజు, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, పార్టీ సీనియర్ నాయకులు నర్సింగారావు పాల్గొన్నారు.



ప్రజా పాలనపై కాంగ్రెస్ దృష్టి సారించాలి

- బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు నేతి చిన్న సంతోష్



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా పాలన గాలికి వదిలిన కాంగ్రెస్ చిత్ర పరిశ్రమ ప్రముఖుల వెంట పడడం భావ్యం కాదని బీఆర్ ఎస్ సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ యువ నాయకుడు నేతి చిన్న సంతోష్ అన్నారు. మంగళవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు మరిపించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆడుతున్న కొత్త నాటకమన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇందులో భాగంగానే సినిమా హీరో అల్లు అర్జున్ కేసును, హైడ్రా పేరుతో నాగర్జున కుటుంబాన్ని టార్గెట్ చేశారని, ఆ తర్వాత మోహన్ బాబు కుటుంబంలోని గోడవలను పైకి తెస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభు త్వం సినీ ఇండస్ట్రీ ని పర్సనల్ గా టార్గెట్ చేస్తూ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు. ఎన్నికల ముందు అధికారం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని 13 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఏమి ఒరిగిందని ఆయన ప్రశ్నించారు.

పార్టీ కోసం పనిచేసిన వాళ్లకే గుర్తింపు



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీని కాపాడిన వాళ్ళకే గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నాగరిగారి ప్రీతం ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణానికి చెందిన పుట్ల ప్రసాద్, నారాయణ రావుపేట మండలం గుర్రాల గొంది గ్రామానికి చెందిన ఎర్ర హరీష్‌లకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌లుగా బాధ్యతలు అప్పగిస్తూ, నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్, హరీష్ లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమకు ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు, ఉప ముఖ్యంత్రి బట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజానర్సింహ, ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, మైనం పల్లి హనుమంత్ రావు, ప్రీతం, విజయ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన సేవాదళ్ రాష్ట్ర నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నాయిని నర్సింహా రెడ్డి, సాకి అనందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ పుట్ల యేసు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్, కిసాన్ సెల్ జనరల్ సెక్రెటరీ మాశిని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గురుకులాలను అజ్ఞానంగా మారుస్తున్న ప్రభుత్వం



నవతెలంగాణ-గజ్వేల్

గురుకుల విద్యాలయాలను అజ్ఞానంగా మారుస్తున్నారని బీఆర్ఎస్వి గజ్వేల్ ప్రధాన కార్యదర్శి నవాజ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేకచోట్ల విద్యార్థులు గురుకులాల నుండి ఇంటికి వెళ్ళిపోతున్నారని కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారని మరికొందరు ఫుడ్ ఇన్ఫెక్షన్ వచ్చి చనిపోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురుకులాల పాఠశాలలో విద్యార్థులు విషాదం, పాముకాట్లు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పైగా ప్రతిపక్షాలపై దాడులకు దిగుతుందన్నారు. కెసిఆర్ ఆనవాలను లేకుండా చేస్తానని అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా విద్యార్థుల సమస్యలను పట్టించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో ఇలాగే ఆత్మహత్యలు జరిగితే బీఆర్ఎస్వి తరుపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

శాంతి, కరుణ, క్షమా గుణం క్రీస్తు బోధనలు



నవతెలంగాణ-మిరుదొడ్డి

శాంతి, కరుణ, క్షమ గుణం క్రీస్తు బోధనలు మానవాళికి ఎంతో అనుసరిస్తుందని ఏపీఎం డకయ్య అన్నారు. మంగళవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అంతా బాయ్ బాయ్ అంటూ కలిసిమెలిసి ఉన్న దేశం భారతదేశమన్నారు. శాంతియుతంగా ఉండి మంచి మార్గంని తెలిపే పండుగ క్రిస్మస్ పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు పరశురాం, శ్రీనివాస్, వైకుంఠం, సిద్ధిరాములు, మణమ్మ, శారదతో పాటు వివోఏలు భూపాల్, మహేష్ నశిరుద్దీన్, స్వప్న యమునా, శోభా, శ్యామలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-రాయపోల్

క్రిస్టమస్ వేడుకలకు మండల పరిధిలోని రాయపోల్, తిమ్మక్ పల్లి, అనాజీపూర్, కొత్తపల్లి, రామారం, వడ్డేపల్లి, బేగంపేట, ముంగాజ్ పల్లి, ఆరేపల్లి, పలు గ్రామాలలోని చర్చిలను అంగరంగ వైభవంగా సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. డిసెంబర్ 25 ఏసుక్రీస్తు పుట్టిన రోజు క్రైస్తవులు ఎంతో పవిత్రమైన రోజుగా భావించి, ఆ పర్వదినాన్ని కుటుంబ సభ్యులందరతో కలిసి ఉల్లాసంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుంటారు. క్రైస్తవులందరూ క్రిస్టమస్ పండుగను నిర్వహించుకోవడానికి చర్చిలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి సిద్ధం చేసుకున్నారు. క్రైస్తవులకు క్రిస్టమస్ పండుగ అతి పెద్ద పండుగ. క్రిస్టమస్ పండుగ రోజు చిన్న పెద్దలు తేడా లేకుండా కుటుంబ సభ్యులు అందరూ నూతన వస్త్రాలు ధరించి, రకరకాల భోజనాలు ఏర్పాటు చేసుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ అందరూ కలిసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

డా.బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలూలలు వేసి నాయకులు, కార్యకర్తలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయం, అణచివేత, దోపిడీకి గురెన ప్రజలకు బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాం గం రూపంలో హక్కులు ప్రసాదించారని, వారి వల్లనే అభివృద్ధి దిశగా నడిస్తున్నామన్నారు. అంబేద్కర్ పేరు మా కోసం ఫ్యాషన్ కాదు, అది ఒక విప్లవమన్నారు. నిండు పార్లమెంటు సభలో బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. అమిత్ షా తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, తన మంత్రి పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్, ఆంక్షరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, లక్ష్మి, గోపికృష్ణ, అత్తు, కలీముద్దీన్, షాబుద్దీన్, రాజ్ బహదూర్, అనిల్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మనుధర్మంపై యుద్ధం ప్రకటించిన పెరియర్

- డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

పేద వర్గాల జీవితాల బాగుకోసం మనుధర్మంపై యుద్ధం ప్రకటించిన పెరియర్ రామస్వామి 51 వర్ధంతిని మున్సిపల్ కేంద్రమైన గజ్వేల్‌లో మంగళవారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ పెరియార్ రామస్వామి నీతి నిజయితీ, సేవాభావం గల వ్యక్తిని, బడుగుబలహీన వర్గాల కోసం పాటుపడిన మహానుభావుడు అన్నారు. మనువాదంపై యుద్ధం ప్రకటించి బడుగుల జీవితాల కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ప్రతీ ఒక్కరు పెరియార్ మార్గంలో నడిచి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు జాలిగామ బాలనర్సయ్య, స్వామి, మంజీర దళిత సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి కిరణ్, డిబిఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుల ఎన్నిక



నవతెలంగాణ-చేర్యాల

బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ సంజీవులు నాయకత్వంలో మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి దండ్యాల బిక్షపతి రెడ్డి, సభ్యత్వ కో కన్వీనర్ ఎం.నర్సింహులు సమక్షంలో బీజేపీ గ్రామ స్థాయి బూత్ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ 24 వ బూత్ అధ్యక్షుడిగా యాసరేని లక్ష్మీపతి, 25 వ బూత్ అధ్యక్షుడిగా కాల్వ మహేష్‌ను ఎన్నుకున్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, బిజెవైఎం జిల్లా కార్యదర్శి పొన్నబోయిన అనిల్,మండల నాయకులు బొజ్జా కృష్ణ ప్రసాద్, తరిగొప్పుల రాజు, బండారి ఐలయ్య నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేటను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



- బేగంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి.

నవతెలంగాణ-రాయపోల్

సిద్దిపేట జిల్లాను డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి యువత ప్రజలు సహకరించాలని బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కిరాణ షాప్‌లలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధవహించాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను యువత ఎక్కడైనా వాడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిగిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా అక్రమంగా రవాణా చేసిన, వాటిని విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మాశెట్టి నరేష్, సిల్వేరి ఆంజనేయులు కిరాణా షాపుల్లో గుట్కా, అంబర్ ప్యాకెట్స్, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటీ క్రైమ్, నార్కోటిక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జేఏసీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాలను రెవిన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు జేఏసీ చైర్మన్ ఆర్.పరమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్నదని ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలన్నారు. చేర్యాల ప్రాంతానికి ఉన్న అనేకమైన అనుకూల అంశాలను కలెక్టర్‌కు పూర్తిగా వివరించినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు గిరి కొండల్ రెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, అందె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

నవతెలంగాణ-మిరుదొడ్డి



నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పక్కిరుగల్ల పోశవ్వ, పుల్లూరు పోశవ్వ కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. ఇరు కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధర్మారం బాబు, ధర్మారం మల్లయ్య, పెద్దమాతరి మల్లయ్య, ఏరోళ్ల నర్సింలు, చిన్నగల్ల కనకయ్య, పుల్లూరు బాబు, ఎర్రోళ్ల ఎల్లయ్య, ఎర్రోళ్ల రాజయ్య, ఎర్రోళ్ల దేవేందర్, పెద్ద లచ్చయ్య, చిన్న లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీసీఎస్ మండలాధ్యక్షునికి పితృవియోగం

నవతెలంగాణ-మర్కుక్



కేవీపీఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు పొట్టోల్ల దాసుకు పితృవియోగం జరిగింది. సోమవారం పొట్టోళ్ల దాసు తండ్రి దేవయ్య మృతి చెందటంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య , కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సుధీర్, ఫోర్ మెన్ యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ కృష్ణమూర్తి, గజ్వేల్ డివిజన్ నాయకులు మర్కుక్ మాజీ సర్పంచ్ నర్సింలు, ఎలక్ట్రిసిటీ నాయకులు చంద్రం యాదవ్,నర్సింలు, కృష్ణ, ఉపాధ్యాయులు పరశురాములు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ కొండపాక



మండల పరిధిలోని లకుడారం అనారోగ్యంతో ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స చేయించుకున్న లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా తపస్ పల్లి గ్రామానికి చెందిన కంకణాల రామస్వామికి రూ.24,000 లకుడారం గ్రామానికి చెందిన అనంత నగేష్ కు రూ.10 వేలు, తిప్పారం గ్రామానికి చెందిన మల్లవ్వకు రూ.12 వేలు విలువ చేసే చెక్కులను మాజీ వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అందజేశారు

మర్మముల సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని మర్మముల సబ్ స్టేషన్‌లో నిర్మాణం జరుగుతున్న పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులను చేర్యాల ఏడి ఈ వెంకటేష్ గౌడ్, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లో 5 ఎం.వి.ఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మద్దూరు మండలంలోని వంగపల్లి, దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామాలలో 33/11 కెవి సబ్ స్టేషన్లను నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్రామాలలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వెంటనే వినియోగదారులు చెల్లించాలని ఆయన కోరారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు

నవతెలంగాణ- గజ్వేల్




అంబేద్కర్‌పై అనుచిత వాక్యాలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరాఫ్ చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం క్యాబినెట్లో రెండవ నేతగా ఉన్న హెూం మంత్రి అమిత్‌షా ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారన్నారు. దేశ ప్రజలు ఈ విషయాన్ని ఖండిస్తున్నా దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి అమిత్‌షా మాత్రం క్షమాపణ చెప్పడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భాను ప్రకాష్ రావు, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మొనగారి రాజు, విజయ్ కుమార్, బాబా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాసంగి పంట పొలాలకు నీరు విడుదల

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నవ తెలంగాణ-మిరుదొడ్డి



గ్రామంలో ఉన్న పెద్ద చెరువు ద్వారా పండే పంట పొలాలకు మంగళ వారం బొంపల్లి గ్రామంలో రైతుల పంట పొలాలకు నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ చెరువు దగ్గర ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బోయిని స్వామి, మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్ మాజీ ఎంపిటిసి ఉమారాని-బాలాగౌడ్, నాయకులు పాపని రామాగౌడ్, అయితం శ్రీనివాస్ బొల్లు స్వామి జయరాములు, మంగలి రమేష్ సాయిపాల్గొన్నారు.

కౌన్సిలర్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళ వారం నివాసంలో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహిం చిన కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా అయ్యప్ప మాలధారణంగా తలకొక్కల దుర్గ ప్రసాద్ ప్రతి ఏటా ధరిస్తారు. ఈ సారి కూడా మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిల్ సభ్యులు అత్తిలి శ్రీనివాస్, కనకయ్య, గుంటుకు రాజు, శ్రీధర్, మల్లేశం యాదవ్, ఉప్పల మెట్టయ్యతో పాటు తలకొక్కుల లక్ష్మణ్ చంద్రకళ ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వాక్యాతగా అయ్యప్ప మాలదారుడు బొగ్గుల సురేష్ వ్యవహరించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-శివ్వంపేట

తన అన్నతో కలిసి తిరుగుతున్నావని తమ్ముళ్లు వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సాయిలు తెలిపారు. కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన గొల్ల వెంకటేష్ వెంట తిరుగుతున్నాడని మనసులో పెట్టుకొని వెంకటేష్ తమ్ముళ్లు గొల్ల నవీన్, గొల్ల యాదగిరిలు చాకలి శ్రీనివాస్‌ను బూతు మాటలు తిడుతూ, కట్టెలతో దాడి చేశారని బాధితుని భార్య భాగ్యలక్ష్మీ పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సాయిలు తెలిపారు.

ప్రమాదాలు జరిగినపుడే స్పందిస్తారా

- ఈ రోడ్డును బాగు చేయండి సారూ
- గుంతల మయంగా మారిన రోడ్డు
- రెండు గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్రవాహనదారులు
- వర్షంపడితే చాలు నీటితో నిండి కనిపించని రోడ్డు
- స్కూల్ బస్సులు రాక స్కూలుకు వెల్లని విద్యార్థులు
- పరిశ్రమలుండడంతో వెలుతున్న భారీ వాహనాలు





నవతెలంగాణ-మనోహరాబాద్



భారీ రద్దీగా ఉండే రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతల మయంగా మారడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడిందంటే చాలు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. గుంతలలో నీరు నిలిచి గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్ద పెద్ద పరిశ్రమలు, మరో కంకర మిషన్ ఉండడంతో పెద్ద ఎత్తున భారీ వాహనాలు వెలుతుంటాయి. అయినా ఎవరు ఆ రోడ్డు వైపు చూడరు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెలుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. ఆ రోడ్డు మార్గం గుండానే రెండు గ్రామాలు డిల్లాయి, కూచారం తాండాలు ఉంటాయి, ఆ రెండు గ్రామాలకు స్కూలు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు స్కూలుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదెక్కడో కాదండి రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజక వర్గంలోని మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామ పంచాయతీ పరిధిలోనిదే ఈ దుస్థితి. పూర్తి వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్ నుంచి కూచారం పంచాయతీ పరిధిలోని డిల్లాయి, కూచారం తాండాలకు వెళ్లే మార్గం. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి కోసం మండలంలోని కూచారం గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని టీఎస్ఐఐసి ద్వార పరిశ్రమలకు కేటాయించింది. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కావడంతో దాంతో ఆ రోడ్డు మార్గంలోనే అధిక సంఖ్యలో పెద్ద పెద్ద వాహనాలు వెలుతుంటాయి. ఆ మార్గంలోనే ఒక పేపర్ పరిశ్రమ దాంతో పాటు మరో కంకర మిషన్‌తో పాటు అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. ప్రతి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెలుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిపోయింది. ఆ రోడ్డు మార్గంలో పరిశ్రమల కార్మికులు, గ్రామాల ప్రజలు వెల్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆయా గ్రామాల నుండి ప్రజలు ద్వి చక్రవాహనాలపై వెళ్లాలంటేనే ఇబ్బందులకు గురౌతున్నారు. చిన్నపాటి వర్షం పడిందంటే చాలు గుంతలలో నీరు నిలిచిపోయి వెల్లలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ రోడ్డు మార్గంలోనే రెండు గ్రామాలు డిల్లాయి, కూచారం తాండాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాలకు గతంలో మూడు స్కూలు బస్సులు రావడంతో విద్యార్థులు స్కూలుకు వెళ్లేవారు. కానీ రోడ్డు గుంతల మయంగా మారడంతో వచ్చే స్కూలు బస్సులు రాకుండాపోయాయి. దాంతో ఆ రెండు గ్రామాల విద్యార్థులు స్కూలుకు డుమ్మాలు కొట్టి చదువుమానేసే పరిస్థితి నెలకొంది.

రోడ్డు ఏర్పాటుకు గడకు వినతి చేసిన డైరెక్టర్

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మాలోతు మాంగ్యానాయక్ మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావ్ దృష్టికి తీసుకెల్లాడు. దాంతో మాజీ మంత్రి హరీష్‌రావ్ రోడ్డును మంజూరు చేస్తున్నట్టు చెప్పినప్పటికి ఆ పనులు మాత్రం ప్రారంభంకాలేదు. అలాగే అప్పటి గడ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డికి సైతం వినతి పత్రం ఇవ్వడంతో సుమారు కోటి రూపాయలు మంజూరై టెండర్ కూడా పిలిచారు. అయినప్పటికి ఇప్పటి వరకు సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులను ప్రారంభించలేదు. రోడ్డు మంజూరై పనులను ప్రారంభించకపోవడంతో వాహనదారులు, ప్రజలు, పాఠశాలల విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించుకుని మంజూరైన పనులు ప్రారంభించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, రోడ్డు పనులను ప్రారంభించి ఇరు గ్రామాల ప్రజల ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మా భూములు పార్కుకు ఇవ్వలేము

- చౌటపల్లి గ్రామస్తుల ఆందోళన
- ఇందిరమ్మ ఇచ్చిన భూములను ఎలా గుంజుకుంటారు
- మంత్రి పొన్నం ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-అక్కన్నపేట



మా భూములు ఇండస్ట్రియల్ పార్కుకు ఇవ్వలేమని, ఇస్తే చావే శరణ్యమని చౌటపల్లి గ్రామ రైతులు అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటపల్లి శివారులోని 312 సర్వే నెంబర్‌లో గల భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి కలిసి స్థల పరిశీలన చేశారన్నారు. తోటపల్లి, జనగామ, చౌటపల్లి శివారులో మొత్తం 128 ఎకరాల భూమికి సంబంధించి స్థల సేకరణ చేయడం జరిగిందని, అంతేకాకుండా ఇట్టి భూమిపై అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే చేసే సమయంలో అధికారులు తప్పులు చేశారని, గ్రామంలోని ముగ్గురు కాంగ్రెస్ నాయకులు చెప్పిన ప్రకారమే సర్వేలో రాసుకున్నారన్నారు. నిజమైన పేద రైతులకు ఈ పార్కు వల్ల అన్యాయమే జరుగుతుందని తెలియజేశారు. కబ్జా మీద ఉన్న వాళ్ల పేర్లు కాకుండా కబ్జాకు లేకుండా పట్టా ఉన్న వారి పేర్లను నమోదు చేసుకున్నారని గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. మా భూములను ఇండస్ట్రీ పార్కుకు ఇవ్వమని మాకు ఐదు, పది గుంటలు మాత్రమే భూమి ఉందని అలాంటి భూమి ఇస్తే మేము ఎలా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ ప్రభుత్వం దౌర్జన్యంగా మా భూములను లాక్కోవాలని చూస్తే మరణమే శరణ్యమని ఖరాకండిగా తెలిపారు. ఆనాడు ఇందిరమ్మ భూములు లేని నిరుపేదలకు భూములు అందిస్తే మళ్లీ భూములు లాక్కోవడమేంటని, భూములతో పాటు ఇందిరమ్మ ఇచ్చిన ఇండ్లను కూడా లాక్కోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పూటకో మాట చెబుతూ, మమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఈ భూముల విషయంలో ఎంత దూరమైన వెళ్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలిసి తమ ఆవేదన వెళ్లబోస్తామని తెలియజేశారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమ ఆవేదన వినాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలుగూరి వెంకటయ్య, సుద్దాల రాజమౌళి, మాశం రాజేందర్, బింగి కనుకయ్య, వైనాల శ్రీను, గాదర్ల నాగభూషణ్, సుద్దాల సుమంత్, కామాద్రి ఎల్లవ్వ, వైనాల సూరవ్వ, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలి

- యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి
- మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎంఈఓ రచ్చ కిష్టయ్య

నవతెలంగాణ-చేర్యాల

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మంగళ వారం మండల శాఖ ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎంఈఓ రచ్చ కిష్టయ్య ఆవిష్కరించారు. అనంతరం చిర్ర యాదగిరి మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్ర మహాసభలను రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్ర మహాసభలను నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో లోతైన చర్చ జరుగుతుందని, ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తోపాటు నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. "భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏం జరుగుతుంది?" అనే అంశంపై ప్రొఫెసర్ కె. నాగేశ్వర్," విద్యలో రాజ్యాంగ విలువలు" అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు డాక్టర్ కె. శ్రీనివాస్,"జాతీయ విద్యా విధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం"అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జెఎన్‌యు సహాయ కార్యదర్శి కుమారి అయిషీ గోష్ సందేశాలు ఉంటాయని తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, చేర్యాల, మద్దూరు మండలాల ప్రధాన కార్యదర్శులు పిల్లి రాజు, కాటం శ్రీనివాస్, సీనియర్ నాయకులు బూరుగు సత్యనారాయణ, పాక చంద్రమౌళి, కాటం రాజశేఖర్ పాల్గొన్నారు.



పంట సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-తొగుట



ఫ్రెంచ్ బీన్ పంటలో పసుపు రంగు జిగురు అట్టలతో వైరస్ తెగుళ్ల కట్టడి చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున రైతులకు సూచించారు. మంగళవారం పెద్దమాసాన్ పల్లి రైతు మెట్టు మల్లయ్య ఫ్రెంచ్ బీన్ వ్యవసాయ క్షేత్రంలో పసుపు రంగు జిగురు అట్టలు పెట్టారు. ఫ్రెంచ్ బీన్ పంటలో నష్టా లను కలిగించే వైరస్ తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెంచ్ బీన్ కూరగాయ రూపం లోనూ, పప్పు అనగా రాజ్మా రూపంలోనూ తీసు కుంటారని అన్నారు. ఎల్లారెడ్డిపేట క్లస్టర్ పరిధిలో సుమారు 60 ఎకరా ల్లో రైతులు ఫ్రెంచ్ బీన్ పంట ను సాగు చేస్తున్నారని తెలిపారు. ఫ్రెంచ్ బీన్ పంటలో పెద్ద మొత్తంలో నష్టాన్ని కలిగించే మొసైక్ వైరస్ తెగులు, ఈ తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు నష్టపోతున్నారని వివరించారు. మోసాయిక్ వైరస్ తెగుళ్లు పేను బంక అనే రసం పీల్చే పురుగు ద్వారా వ్యాప్తి చెందుతుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల, లేత కొమ్మలు అడుగు భాగాన చేరి రసం పీల్చడం ద్వారా ఈ వైరస్ తెగు లు వ్యాపించి ఆకులు పసు పు పచ్చ రంగులు మారుతాయన్నారు. దీని నివారణ కొరకు సమ గ్ర సస్యరక్షణ చర్యలో భాగంగా పసుపుపచ్చ జిగురు అట్టలును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ జిగురు అట్టలు పేను బంక ఆక ర్షితులై అతుక్కు పోతాయి, తద్వారా పురుగుల సంఖ్యను నియంత్రిం చడంతో పాటు జిగురు అట్టలు పై అతుక్కున్న పేను బంక సంఖ్యను బట్టి ఎకరానికి ఎసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మందును పిచికారి చేసుకోవాలన్నారు. ఎకరానికి 5 నుంచి 6 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయలన్నారు. ఈ అట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా రైతులు 30% పురుగుల మందు వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు పెట్టు బడి ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు.

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణిలో స్వీ కరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిం చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఆదేశించారు. మంగళవా రం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 75 దరఖాస్తులను తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.